
సాక్షి అనకాపల్లి

మంగళవారం । 24 । డిసెంబర్ । 2024

7



నేవీ విన్యాసాలకు ఏర్పాట్లు

ఏయూక్యాంపస్: విశాఖ బీచ్‌రోడ్డులో జనవరి 4వ తేదీన నిర్వహించే నేవీ విన్యాసాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.



'ఇంటర్'కు తత్కాల్ అవకాశం

విశాఖ విద్య : ఇంటర్ వార్షిక పరీక్ష ఫీజు చెల్లించేందుకు తత్కాల్ అవకాశం కల్పించారు. ఈ నెల 31లోపు రూ.3 వేలు చెల్లించాలి.



గోదాదేవికి తిరువీధి సేవ

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం గోదాదేవికి తిరువీధి సేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

గంజాయి కేసులో 20 ఏళ్ల జైలు

కశింకోట: తాళ్లపాలెంలో పట్టుబడిన గంజాయి కేసులో ఇద్దరు నిందితులపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష నగదును జరిమానాగా విధించారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎస్.శ్రీవిద్య తీర్పు చెప్పారని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. తాళ్లపాలెం కూడలిలో 2019లో 20 కిలోల గంజాయిని కారులో తరలిస్తుండగా అప్పటి ఎస్ఐ ఎ.వి.ఎస్.వి.రామకృష్ణ, సిబ్బంది ఆకస్మికంగా దాడి చేసి పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకొని అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలానికి చెందిన వంతల రాజుబాబు (35), చింతపల్లి మండలానికి చెందిన వశపారి రాంప్రసాద్ (30)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు కోర్టులో తుది విచారణకు రావడం, నేరం రుజువు కావడంతో జిల్లా అదనపు కోర్టు న్యాయమూర్తి ఎస్. శ్రీవిద్య నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధించారని ఎస్పీ తెలిపారు. అప్పటి ఎస్ఐ రామకృష్ణ, ఇప్పటి సీఐ అల్లు స్వామినాయుడు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, కోర్టు మానిటరింగ్ విభాగం సిబ్బంది, సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పర్చి నిందితులకు శిక్ష పడేలా దర్యాప్తు నిర్వహించిన అధికారులను ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

వృద్ధురాలి ఆత్మహత్య

అనారోగ్యం, వృద్ధాప్య సమస్యలతో బలవన్మరణం



మృతి చెందిన పైడితల్లమ్మ

కె.కోటపాడు: పురుగు మందును తాగి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మేడిచర్ల గ్రామానికి చెందిన భూమిరెడ్డి పైడితల్లమ్మ (74) సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతిపై ఎ.కోడూరు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. మేడిచర్లకు చెందిన భూమిరెడ్డి పైడితల్లమ్మ వృద్ధాప్యంతో పాటు తరచూ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడేది. భర్త గత కొన్నేళ్ల క్రితమే మరణించడంతో కుమారుడు సింహాచలంనాయుడి వద్ద ఉంటోంది. అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ఆమె ఈనెల 19న పురుగు మందును తాగింది. తల్లి అపస్మారక స్థితిలో ఉండడాన్ని కుమారుడు గమనించి కె.కోటపాడు సీహెచ్‌సీ తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో సోమవారం మృతి చెందింది. తల్లి పైడితల్లమ్మ మృతిపై సోమవారం ఆమె కుమారుడు సింహాచలంనాయుడు ఫిర్యాదు అందించినట్లు ఎస్ఐ తెలిపారు. పైడితల్లమ్మ మృతదేహానికి కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

కమ్ముకున్న కారుచీకట్లు

మహా విశాఖ నగరంలో కారుచీకట్లు అలముకుంటున్నాయి. వీధి దీపాలు వెలగకపోవడంతో చీకటి పడితే అంధకారమే రాజ్యమేలుతోంది. ఆయా కాలనీల్లో ఏ వీధిలో చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. రోజుల తరబడి వీధి దీపాలు వెలగకపోయినా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ప్రజలు పదే పదే ఫిర్యాదుల చేస్తే వేరే వీధిలోని దీపాలను తీసుకొచ్చి అమర్చుతున్నారు తప్ప, శాశ్వత పరిష్కారం చూపడం లేదు.




వడ్లపూడి ఆస్పత్రి రహదారిలో వెలగని వీధి దీపాలు



విశాఖ అక్కిరెడ్డిపాలెం పంచవటి గోడ పక్కగా వెలగని వీధి లైట్లు

మొత్తం వీధి దీపాలు	1.18 లక్షలు
వెలుగుతున్నవి	80 వేలు
వెలగనివి	38 వేలు

ఏటా కాంట్రాక్టర్‌కు చెల్లిస్తోంది రూ.13.56 కోట్లు



విశాఖ కళింగనగర్‌లో వెలగని వీధి దీపాలు



- జీవీఎంసీలో వెలగని వీధి దీపాలు
- రూ.లక్ష ఇస్తే బాగున్నాయంటూ ఎన్‌వోసీ
- కూటమి కార్పొరేటర్ల కొత్త దందా

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

జీవీఎంసీ పరిధిలో మొత్తం 1.18 లక్షల వీధిదీపాలున్నాయి. ఏడేళ్ల పాటు వీటి నిర్వహణ బాధ్యతను బ్రిడ్జ్ అండ్ రూఫ్ అనే ప్రైవేటు ఏజెన్సీకి జీవీఎంసీ 2023లో అప్పగించింది. ఇందుకు ఏటా రూ.13.56 కోట్లు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. సదరు ఏజెన్సీ సబ్ కాంట్రాక్టు ఇవ్వడంతో నిర్వహణ సరిగా లేదన్న విమర్శల నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో రెండు సార్లు నోటీసులు జారీచేశారు. మూడోసారి కూడా నోటీసులు జారీచేసి కాంట్రాక్టును రద్దు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈలోగా ఎన్నికలు జరిగి కూటమి ప్రభుత్వం వచ్చింది. ఇప్పుడు వీధి దీపాలు వెలుగుతున్నాయంటూ కవరింగ్ చేసి.. మామూళ్లు దండుకునేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఈ మేరకు కార్పొరేటర్ల నుంచి దీపాలు వెలుగుతున్నట్టు సంతకాలు తేవాలంటూ కొత్త విధానాన్ని తెరమీదకు తెచ్చారు.

వీధి దీపాల నిర్వహణ.. కూటమి కార్పొరేటర్లకు కాసులు కురిపిస్తోంది. అదేంటి అనుకుంటున్నారా.. సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించాలంటే వీరే ఎన్‌వోసీ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం షరతు విధించింది. దీంతో వీధి దీపాల నిర్వహణ కాంట్రాక్టర్ వీరిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. 'వార్డులో వీధి దీపాలన్నీ సక్రమంగా వెలుగుతున్నాయి. సమస్య ఎదురైనా.. వెంటనే పరిష్కరిస్తున్నారు. సేవల పట్ల సంతృప్తిగానే ఉన్నామని'ఒక లేఖ ఇవ్వండి అంటూ కూటమి కార్పొరేటర్లను కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే అదునుగా వీరు వసూళ్లకు తెరతీశారు. సంతకం పెట్టాలంటే రూ.లక్ష చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

సంతకం పేరుతో సదరు కాంట్రాక్టు సంస్థ నుంచి భారీగా మామూళ్లు దండుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గాజువాక, పెందుర్తి ప్రాంతాలకు చెందిన కూటమి కార్పొరేటర్లే మామూళ్లకు తెగబడటం గమనార్హం.

కాంట్రాక్టరుతో కుమ్మక్కు..!

వీధి దీపాలు వెలగడం లేదన్న విమర్శల నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో అప్పటి జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సదరు కాంట్రాక్టరుకు రెండు సార్లు నోటీసులను జారీ చేశారు. మూడోసారి కూడా నోటీసు జారీచేసి కాంట్రాక్టును రద్దు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌కు ఆదేశాలు కూడా జారీచేశారు. అయితే ఎన్నికలు.. అనంతరం బదిలీతో ఈ **ప్రక్రియ కాస్తా నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో వీధి దీపాల వ్యవహారంపై కార్పొరేటర్ల నుంచి విమ్మర్శలొచ్చాయి. దీనిపై లో**తుగా అధ్యయనం చేసి.. సదరు కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశం జరిగి మూడు నెలలు దాటినప్పటికీ ఆ దిశగా కనీస చర్యలు లేవు. పైగా మూడో నోటీసు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వంలోని కీలక కార్పొరేటర్లు చక్రం తిప్పుతున్నట్టు తెలుస్తోంది. సదరు కాంట్రాక్ట్‌ను రద్దు చేయకుండా ఉండేందుకుగాను భారీగా మామూళ్లకు మాట్లాడినట్లు సమాచారం.



అనకాపల్లి 84వ వార్డులోని చిన్న నూకాలమ్మ తల్లి ఆలయ రహదారి వీధి

ఎప్పుడూ చీకట్లోనే..!



అనకాపల్లిలో గవరపాలెం మరిడిమాంబ అమ్మవారి వీధిలో వెలగని వీధి దీపం

జీవీఎంసీ పరిధిలో ఉన్న వీధి దీపాలు వెలుగుతున్నాయో? లేదో? కంట్రోల్ రూమ్ నుంచి నేరుగా తెలుసుకోవచ్చు. జీవీఎంసీ పరిధిలో 80 వేల వరకు వీధి దీపాలు వెలుగుతుండగా.. 38 వేల వీధి దీపాలు వెలుగులు విరజిమ్మడం లేదు. అయితే అన్ని వీధి దీపాలు వెలుగుతున్నట్టుగా ఎప్పటికప్పుడు నివేదికలు మాత్రం అధికారులకు చేరుతుండటం గమనార్హం. మరోవైపు తమ వీధిలో వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదులు వస్తే సిబ్బంది వేరే ప్రాంతంలోని వీధి దీపాలను తీసుకొచ్చి అక్కడ అమరుస్తున్నారు. **కొత్త దీపాలను కొనుగోలు చేయకుండా** షటిల్ **సర్వీసుతో కాంట్రాక్టు సంస్థ గేమ్‌లు ఆడుతోందన్న ఆరోపణలు** బలంగా **వినిపిస్తున్నాయి.**

కూటమి కార్పొరేటర్ల నయా దందా..!

వార్డుల్లో వీధి దీపాలు సక్రమంగా వెలుగుతున్నట్లు స్థానిక కార్పొరేటర్ నుంచి అంగీకార పత్రం ఉండాలంటూ తాజాగా అధికారులు మెలిక **పెట్టారు. ఇదే అదనుగా సదరు కాంట్రాక్టర్ నుంచి వసూళ్లకు** తెర**లేపారు. తమ వార్డులో వీధి దీపాలు బాగున్నాయని సంతకం** పెట్టా**లంటే రూ.లక్ష చొప్పున ఇచ్చుకోవాల్సిందేనని షరతు విధించినట్టు తెలుస్తోంది. అసలు వీధి దీపాలు వెలుగుతున్నాయా? లేదా?** అం**శాన్ని కంట్రోల్ రూం నుంచి నేరుగా పరిశీలించే వీలుంది. అయినప్పటికీ కూటమి కార్పొరేటర్లకు మామూళ్లు వచ్చేలా చేసేందుకే ఈ కొత్త విధానాన్ని తెరమీదకు తెచ్చారన్న విమర్శలున్నాయి.**



జోన్	వీధి దీపాల సంఖ్య
జోన్-1	5,190
జోన్-2	17,919
జోన్-3	11,120
జోన్-4	9,567
జోన్-5	20,818
జోన్-6	24,763
జోన్-7	8,654
జోన్-8	19,969
మొత్తం	1,18,000

నేరాలకు అడ్డాగా.. చీకటి ప్రాంతాలు

విశాఖలో వీధి దీపాల నిర్వహణకు 400 మంది సిబ్బందిని నియమించి, పర్యవేక్షించేందుకు కాంట్రాక్టర్ అంగీకరించారు. కానీ కేవలం 150 మందితోనే పని నడిపించేస్తుండడంతో రోజూ సుమారు 38 వేలకు పైగా వీధిదీపాలు వెలగడం లేదు. చీకటి పడితే చాలా ప్రాంతాలు అంధకారంలో మగ్గిపోతున్నాయి. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చైన్ స్నాచింగ్‌లు, ఈవ్ టీజింగ్, గంజాయి, డ్రగ్స్ వినియోగం జరిగిపోతున్నాయి. కొండవాలు ప్రాంతాల్లో కారుచీకట్లు కమ్మేయడంతో పార్కింగ్‌లో నిలిపి ఉంచిన ఆటోలు, ఇతర వాహనాల బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి. గంజాయి బ్యాచ్‌లు చీకటి రోడ్లపై తిష్టవేసి దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. యువతులు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు.



హైవేలో కొమ్మాది జంక్షన్ వద్ద సెంట్రల్ లైటింగ్ దుస్థితి

పట్టు చిక్కితే సిరులే..!

- లాభాలు కురిపిస్తున్న పట్టు పురుగుల పెంపకం
- రైతులను ప్రోత్సహిస్తున్న సెరికల్చర్ శాఖ
- జిల్లాలో 284 హెక్టార్లలో సాగవుతున్న మల్బరీ తోటలు



లాభాలు ఇలా..

ఒక ఎకరా పరిధిలో మల్బరీ తోటలను పెంచి టైప్-1 షెడ్‌లో 200ల చాకీ పురుగులను పెంచితే ఏడాదికి నాలుగు దఫాలు పట్టుగూళ్లను తీయవచ్చు. అంటే ఏడాదికి 800 కిలోల పట్టుగూళ్ల ఉత్పత్తి సాధ్యమవుతుంది. ప్రస్తుతం ధర కిలో రూ.650 ఉండగా 800 కిలోలకు రూ.5,20,000 వరకు ఆదాయం సమకూరుతుంది.

రైతు రారాజుగా వెలగాలంటే అందివచ్చిన అవకాశాలను ఒడిసిపట్టుకోవాలి. నిరంతరం కొత్తదనం కోసం ఆలోచన చేయాలి. పది మందీ చేసే సాగు కాకుండా నా రూటే సెపరేటు అన్నట్టుగా ఔరా అనిపించేలా లాభాల పంట పండించాలి. అపుడే రైతు నష్టాల నుంచి తప్పించుకుని లాభాల బాటలో పయనించే అవకాశం ఉంటుంది.



చాకీ పురుగులను పెంచే షెడ్



మల్బరీ తోట

కోటవురట్ల: వ్యవసాయ రంగంలో పెనుమార్పులు వచ్చాయి. తదనుగుణంగా రైతులు ముందుకడుగేస్తున్నారు. మారే కాలంతో పాటు పరుగులు తీస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు. పట్టు పరిశ్రమ తక్కువ కాలంలోనే ఎక్కువ ఆదాయం తెచ్చిపెడుతోంది. అందుకే ఇప్పుడు అందరి దృష్టి ఈ రంగంపై పడింది. ఒకప్పుడు ఏజెన్సీకే పరిమితమైన పట్టు పురుగుల పెంపకం ఇపుడు మైదానానికి పాకింది. కాస్త ఓపిక, శ్రద్ధ ఉంటే చాలు లాభాలు మెండుగా వస్తాయని పట్టు పరిశ్రమ శాఖాధికారులు చెబుతున్నారు. పట్టు పురుగుల పెంపకానికి సెరికల్చర్ శాఖ రాయితీలు కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది. అవగాహన కార్యక్రమాల ద్వారా సలహాలు, సూచనలు అందిస్తోంది. జిల్లాలో 284 ఎకరాల్లో పట్టు పురుగుల పెంపకం జరుగుతోంది. అందులో కోటవురట్ల మండలంలో అత్యధికంగా 125 ఎకరాల్లో మల్బరీ తోటలు పెంచుతున్నారు. ఇంకా నాతవరం, మాకవరపాలెం తదితర మండలాల్లో పట్టు పురుగుల పెంపకం చేపడుతున్నారు.

నెలలోనే ఆదాయం..

పట్టు పరిశ్రమ ద్వారా నెలలోనే ఆదాయాన్ని పొందే అవకాశం ఉంది. పట్టు పురుగుల పెంపకానికి ప్రధానంగా కావలసిన మల్బరీ మొక్కలను ఒకసారి నాటితే 15 ఏళ్ల వరకు తిరిగి చూడనవసరం లేదు. ఇది బహువార్షిక మొక్క కావడంతో అన్ని కాలాల్లోనూ ఆకులు చిగురిస్తాయి. ఎక్కువ నీటి వసతి అవసరం ఉంటుంది. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా తక్కువ ఖర్చుతో నీటిని ఆదా చేసి మల్బరీ తోటలను పెంచవచ్చు. రసాయనిక ఎరువుల అవసరం లేకుండానే మల్బరీ తోటలు ఏపుగా పెరిగే అవకాశం ఉంది. ఒకసారి కోతకు వచ్చాక ఏడాదికి 8 నుంచి 10 దఫాలుగా కోత తీయవచ్చు. పట్టు గూళ్ల కోసం చాకీ పురుగులను 20 రోజులపాటు షెడ్లో జాగ్రత్తగా పెంచాల్సి ఉంటుంది. వీటికి మేతగా మల్బరీ ఆకులను వేస్తుండాలి. వీటిని తిన్న చాకీ పురుగులు పట్టు గూళ్లను అల్లుతాయి. ఇలా 28 రోజుల్లోనే పట్టుగూళ్లు ఎగుమతికి సిద్ధమవుతాయి. తయారైన పట్టుగూళ్లను పాడేరు, చేబ్రోలు, హిందూపూర్, హనుమాన్ జంక్షన్, విజయనగరం, సీతంపేటకు ఎగుమతి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పట్టు గూళ్ల ధర కిలో రూ.650 వరకు పలుకుతోంది. ఇది కాకుండా సెరికల్చర్ శాఖ రైతుకు అదనంగా కిలోకు రూ.50 వంతున ప్రోత్సాహకం చెల్లిస్తోంది.

యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్న యువకులకు పట్టు పరిశ్రమ మంచి అవకాశం కల్పిస్తోంది. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో పట్టు గూళ్ల నుంచి పట్టు దారం తీసే కేంద్రం నెలకొల్పేందుకు పట్టు పరిశ్రమ అవకాశం కల్పిస్తోంది. యూనిట్ ధర సుమారు రూ.12 లక్షలు ఉండగా పట్టు పరిశ్రమ 75 శాతం రాయితీ కల్పిస్తోంది. మిగతా 25 శాతం లబ్ధిదారులు భరించాల్సి ఉంటుంది. దీంతో పాటు మార్కెటింగ్ చేసేందుకు లబ్ధిదారులే సొంతంగా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఎవరైనా ఆసక్తి చూపిస్తే యలమంచిలి పట్టణంలో పట్టు పరిశ్రమకు చెందిన స్థలాన్ని లీజుకు ఇచ్చి యూనిట్‌ను నెలకొల్పేందుకు అవకాశం కల్పిస్తున్నారు. దీంతో స్థానిక రైతులకు ఎగుమతి కష్టాలు తప్పుతాయి. యువతకు ఉపాధి లభిస్తుంది.

రాయితీలతో ప్రోత్సాహం..

పట్టు పరిశ్రమను నడిపేందుకు రైతులకు ఆ శాఖ పలు రాయితీలను అందిస్తోంది. మల్బరీ మొక్కలు నాటుకోవడానికి, షెడ్ నిర్మాణానికి, ఘాట్ నిర్మించుకోవడానికి, ఇతర పరికరాలను రాయితీలు ఇస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు మొక్కలు నాటేందుకు రూ.27 వేలు, షెడ్ నిర్మాణానికి రూ.4,05,000లు, ఓసీ, బీసీలకు మొక్కలు నాటేందుకు రూ.22,500, షెడ్డు నిర్మాణానికి రూ.3,37,500 ఆర్థిక సహాయం ఇస్తున్నారు. ఇవికాకుండా ఎస్టీ రైతులకు షెడ్ నిర్మించుకోవడానికి అదనంగా రూ.లక్ష ట్రైకార్ ద్వారా ఇస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సన్నకారు రైతులకు అదనంగా రెండు ఎకరాల్లో మొక్కల పెంపకానికి ఖర్చులుగా రూ.63 వేలు అందిస్తున్నారు. 200 చాకీ పురుగులను రూ.5 వేలకు కొంటారు. ఈ ఖర్చును మాత్రం లబ్ధిదారులు భరించాల్సి ఉంటుంది.

లాభదాయకం



పట్టు పురుగుల పెంపకం లాభదాయకంగా ఉంది. నేను రెండు ఎకరాల్లో మల్బరీ తోటలను పెంచుతున్నాను. ఏడాదికి నాలుగు దఫాలుగా పట్టుగూళ్లను తీయొచ్చు. పట్టు పరిశ్రమ శాఖ అదనపు ప్రోత్సాహం వెంటనే విడుదల చేయాలి. **– జవ్వాది సోమేశ్వరరావు, రైతు, కోటవురట్ల**

ప్రోత్సాహం ఇస్తున్నాం..



పట్టు పరిశ్రమ పెట్టుకునే రైతులను అనేక రాయితీలతో ప్రోత్సహిస్తున్నాం. పట్టు పరిశ్రమ కోసం మల్బరీ మొక్కను ఇవ్వడం నుంచి షెడ్ నిర్మాణం వరకు ఆర్థిక సహాయం ఇస్తోంది. వివరాల కోసం ఫోన్ నంబరు 9866699169లో సంప్రదించండి. **– తాళ్లూరి రాజేంద్రప్రసాద్, పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారి**

కరెంట్ చార్జీల బాదుడుపై పోరుబాట



వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు జోగులు, అదీప్‌రాజు

- 27న జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన
- వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వినియోగదారులు పాల్గొనాలి
- పోస్టర్ ఆవిష్కరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు

సాక్షి, అనకాపల్లి: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారులపై రూ.15 వేల కోట్ల భారం మోపుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు బిగించిన వారిని తరిమికొట్టండన్న నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాటమార్చడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నెల 27న విద్యుత్ చార్జీల బాదుడుపై నిర్వహించే 'వైఎస్సార్‌సీపీ పోరుబాటు' పోస్టర్‌ను సోమవారం స్థానిక రింగ్ రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు, అన్నంరెడ్డి అదీప్‌రాజులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ కార్యాలయాల వద్ద తలపెట్టనున్న 'విద్యుత్ పోరుబాట' కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు పెంచబోమని చంద్రబాబు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే తుంగలో తొక్కారని దుయ్యబట్టారు. ఆరు నెలలు తిరగకుండానే కరెంటు చార్జీలు పెంచారన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటి మినహా ఏ పథకమూ అమలు కాలేదని విమర్శించారు. ఎన్నికల హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని, లేదంటే ప్రజలతో మమేకమై పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, ఏఎంసీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ విభాగం జిల్లా ఇన్‌చార్జి కంబాల సందీప్, జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీపీలు కలగా గున్నయ్యనాయుడు, పైలా శ్రీను పాల్గొన్నారు.

మళ్లీ విస్తారంగా వర్షాలు

వాతావరణ శాఖ హెచ్చరికతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

తుమ్మపాల: బంగాళాఖాతంలో విస్తరించిన అల్పపీడనం ప్రభావంతో కోస్తా ఆంధ్ర అంతటా వాతావరణ శాఖ సూచనల ప్రకారం ఈనెల 26 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటలో తెలిపారు. జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ముందు జాగ్రత్త చర్యలకు ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ సిబ్బంది అందుబాటులో ఉండాలని, నిత్యావసర సరుకులు, ఆయిల్, గ్యాస్ నిల్వలు తగిన స్థాయిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా, డివిజన్ స్థాయిలలో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదనీ, వెళ్లిన వారు వచ్చేయాలని సూచించారు.

కంట్రోల్ రూమ్ నెంబర్లు

కలెక్టరేట్ 08924-226599
ఆర్డీవో, అనకాపల్లి-9491998293
ఆర్డీవో, నర్సీపట్నం-7075356563
08934-245009, 8978542297

రైల్వే ఓవర్ బ్రిడ్జి పై నుంచి ట్రాలర్ బోల్తా


బ్రిడ్జి పై నుండి కింద పడిన ట్రాలర్


తుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ట్రాలర్ డ్రైవర్, క్లీనర్

పాయకరావుపేట : స్థానిక పట్టణ పరిధిలో గల రైల్వే ఓవర్ బ్రిడ్జి పై నుండి ట్రాలర్ పడిపోయినట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు. చెన్నై నుండి కోల్‌కత్తా వెళ్తున్న డబ్ల్యూబిజి 0164 ట్రాలర్ లారీ కొరియర్ పార్సిల్స్ లోడ్‌తో వెళ్తుంది. డ్రైవర్ నిద్రమత్తుతో ఉండడం వల్ల అదుపు తప్పి బ్రిడ్జి పై నుంచి కింద పడింది. తెల్లవారుజామున 4 గంటల సమయం కావడంతో జనం ఎవరూ లేవపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా గాయపడిన ట్రాలర్ డ్రైవర్ ఉపేంద్ర కుమార్, క్లీనర్ నియేష్ కుమార్‌లు తుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అప్పన్న తెలిపారు.

పెద్దేరు నదిలో మునిగి కాడెడ్లు మృతి

- రైతుకు త్రుటిలో తప్పిన ప్రమాదం


పెద్దేరులో మృతి చెందిన కాడెడ్లు

మాడుగుల : మండలంలో జంపెన వద్ద ప్రవహిస్తున్న పెద్దేరు నదిలో సోమవారం ప్రమాదవశాత్తూ రెండు కాడెడ్లు మునిగి మృతి చెందాయి. స్థానికులు కథనం ప్రకారం వివరాలివి. మాడుగుల గ్రామానికి చెందిన పోతల సుభద్రరావు ఎప్పటిలాగే ఏటవతలికి వెళ్లడానికి పెద్దేరులోకి టైరు బండితో దిగారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెద్దేరులో నీటి ప్రవాహం ఎక్కువ ఉండడంతో తోవ కనపడక గోతిలో దిగిపోవడంతో ఎడ్లు కాళ్లు అందక, నీటిలో మునిగి మృతి చెందాయి. రైతు చాకచక్యంతో తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. తమ మనుగడకు ఆధారమైన కాడెడ్లు మృతి చెందాయని, సుమారు రూ.లక్షా 50 వేలు నష్టం వాటిల్లిందని రైతు సుభద్రరావు ఆవేదన చెందారు.

ఎస్పీ కార్యాలయానికి 22 ఫిర్యాదులు


అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్

అనకాపల్లి : ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో 22 అర్జీలు వచ్చాయని అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ తెలిపారు. అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటూ ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్ సమస్యలపై ఎక్కువగా అర్జీలు అందాయన్నారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డి.వెంకన్న పాల్గొన్నారు.

దరఖాస్తుల జోరు...నిరసనల హోరు

- పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ ఫిర్యాదులే అధికం
- సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ గేటు వద్ద నిరసనలు


దళితుల భూములు ఆక్రమించిన టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న రైతులు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసి జాహ్నవి

తుమ్మపాల : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో చేపట్టిన పీజీఆర్ఎస్ కార్యక్రమం నిరసనలు, ప్రజల ఆవేదనతో హోరెత్తింది. ప్రజా సమస్యల్లో అధిక శాతం భూ సంబంధిత సమస్యలు వస్తున్నా పరిష్కారం జరగడం లేదు. గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సులు ప్రచార ఆర్భాటాలకే పరిమితం కావడంతో ప్రజలు వాటిని బహిష్కరించి కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌కే అర్జీలు చేస్తున్నారు. అయితే పదేపదే వినతులు ఇస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని పలువురు చెబుతున్నారు. మొత్తం 249 అర్జీలు నమోదు కాగా వాటిలో 156 అర్జీలు భూ సంబంధిత అర్జీలు రావడమే అందుకు నిదర్శనం.

పీజీఆర్ఎస్‌పై కలెక్టర్ సమీక్ష

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపించడంలో ప్రతి అధికారి దృష్టి సారించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్, జేసి జాహ్నవి, డీఆర్వో సత్యనారాయణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ మండల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో అర్జీల పరిష్కారంపై ప్రత్యేక సమీక్షలు నిర్వహించాలన్నారు. అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, అర్జీలు రీఓపెన్ కాకుండా, పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

భారతరత్న అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పట్టణంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న అన్నారు.

దళితుల భూములు ఆక్రమించారు...

దళితులకు ఇచ్చిన డీ పట్టా భూములను ఆక్రమించిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకుని దళితుల భూమిని దళితులకు ఇప్పించాలని కోరుతూ ఎస్. రాయవరం మండలం, వాకపాడు, వెంకటాపురం బాధిత రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి నిరసన తెలిపారు. 1988లో వాకపాడు, వెంకటాపురం గ్రామాల్లో 103 ఎకరాల భూమిని ఎస్సీ, ఇతర కులస్తులకు మంజూరు చేస్తూ ప్రభుత్వం డీ-ఫారం పట్టాలు ఇచ్చిందని, అయితే ఆయా రైతులను మోసం చేసి భూములు ఆక్రమించిన టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని, పంట నష్టం పేరుతో అధికారులకు తప్పుడు సమాచారం అందించి తన కుటుంబ సభ్యుల పేరున నష్ట పరిహారం పొందిన వ్యక్తిపైనా, ఇందుకు సహకరించిన అధికారులపైనా విచారణ చేపట్టాలని రైతులు కోరారు.


అమిత్‌షాను కేంద్ర కెబినేట్ నుంచి తొలగించాలంటూ కాంగ్రెస్ నిరసన

కలెక్టరేట్ సమీపంలోనే అక్రమ నిర్మాణాలు

కలెక్టరేట్‌కు సమీపంలో బట్లపూడి గ్రామ సర్వే నెం.4 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టి వ్యాపార దుకాణం నిర్వహిస్తున్నారంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

భూముల ఆన్‌లైన్‌లో మోసాలు

వారసత్వంగా ఏళ్లనాటి నుంచి సాగుచేసుకుంటున్న భూమి రికార్డులు తమకు తెలియకుండా ఇతరుల పేరున ఆన్‌లైన్ చేసేసారని పరవాడ మండలం పెదముసిలివాడ గ్రామానికి చెందిన వానపల్లి ఆచారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సేవలు చేస్తున్న తమ కుటుంబానికి మాన్యంగా ఉన్న కంసాలి మాన్యంగా భూమి 1.12 ఎకరాలు స్థానికేతరుల పేరున నమోదు చేసి రెవెన్యూ అధికారులు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని కోరారు.

బోట్ల రిజిస్ట్రేషన్ కోసం అక్రమ వసూళ్లు


ఫిర్యాదు కాపీని చూపిస్తున్న ఆంధ్ర మత్స్యకార జేఏసీ ప్రతినిధులు

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలంలోని పూడిమడక మత్స్యకారుల వద్ద నుంచి బోట్ల రిజిస్ట్రేషన్ కోసం రెండు వేల రూపాయల నగదును అనధికారికంగా వసూలు చేస్తున్నారని ఆంధ్ర మత్స్యకార జేఏసీ ప్రతినిధి మేరుగు నూకరాజు సోమవారం జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్‌కు ఫిర్యాదు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలు వర్తించాలంటే బోట్ల రిజిస్ట్రేషన్ అవసరం అయినందున మత్స్యశాఖ అధికారి, ఇద్దరు సచివాలయ ఉద్యోగులు రూ.రెండు వేల చొప్పున వసూలు చేస్తూ, ఎటువంటి రసీదులు ఇవ్వడం లేదని తాతారావు, సతీష్, పోలయ్య, అప్పన్న తదితరులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బహుమతుల పంట


స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

అనకాపల్లి : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన 8 మంది క్రీడాకారులు బహుమతులు సాధించారు. ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడ కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పోటీల్లో అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలికలు ప్రతిభ కనబర్చినట్టు విశాఖ ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వి.దేముడు సోమవారం ఒక ప్రకటనలో అభినందించారు. ఈ ఏడాది అక్టోబర్‌లో జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు నర్సీపట్నంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఏడుగురు బాలికలు, ఐదుగురు బాలురు ఎంపికైనట్టు ఆయన చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బాలుర విభాగంలో వి.ధనరాజ్, సీహెచ్.కుమారస్వామి బంగారు పతకాలు, పెద్దాడ సూర్య సాకేత్ రజత పతకం, ఎం.నాగరాజు కాంస్య పతకం సాధించగా, బాలికల విభాగంలో ఎ.పూర్వజ స్వర్ణ పతకం, ఎం.లక్ష్మీదేవి, పి.సాయి సంజన శ్రీ, ఎం.అమృతవల్లిలు రజత పతకాలు సాధించినట్టు తెలిపారు.

పాయకరావుపేటలో 28న మెగా జాబ్ ఫెయిర్

తుమ్మపాల: ఈనెల 28న పాయకరావుపేటలో మెగా జాబ్‌ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో చేపడుతున్న జాబ్ ఫెయిర్ పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో ఆమె విడుదల చేశారు. సుమారు 50 కంపెనీలు హాజరై సుమారు 2 వేల ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లమో, ఐటీఐ కోర్సులలో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 28న ఉదయం 9 గంటల నుంచి శ్రీప్రకాష్ డిగ్రీ కాలేజీలో జరిగే జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు చెప్పారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ఆసక్తి గల వారు naipunyam. ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, అడ్మిట్ కార్డు, ఆధార్, అర్హత సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7893799420, 9492429425, 9010793492 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- స్కానింగ్ సెంటర్ల తనిఖీకి ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం -1994పై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రోగ్రాం అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ల తనిఖీకి మండల స్థాయిలో శిశు సంక్షేమ శాఖ, తహసీల్దారు, పోలీసు అధికారులతో ప్రత్యేక కమిటీని నియమించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం లింగ నిష్పత్తి వెయ్యి మంది బాలురుకు 981 బాలికలు ఉన్నారన్నారు. ఈ నిష్పత్తి సమానంగా ఉండాలన్నారు. ఏ ల్యాబొరేటరీ గాని, స్కానింగ్ కేంద్రం గాని గర్భస్థ పిండం లింగాన్ని తెలిపే ఉద్దేశంతో చేయరాదన్నారు. ఇలా చేస్తే మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తారన్నారు. గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబర్‌కు, ఆన్‌లైన్ గ్రీవియన్స్ (pcpndt.ap.gov.in) ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు. ఆడపిల్ల విలువ అపారమని, వారి రక్షణ బాధ్యత మనదే అని అన్నారు. నూతన వధూవరులకు, గర్భిణులకు, అత్త మామలకు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలను ముందుగానే గుర్తించి తొలి ప్రయత్నాలలోనే నిలువరించాలని తెలిపారు. డీఎంహెచ్‌వో ఎం.ఎస్.వి.కె. బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో 73 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిని మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేస్తున్నామన్నారు. సమావేశంలో మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ బాలాజీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, గైనకాలజిస్ట్ శోభాదేవి ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మూడు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన


మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

కశింకోట: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం వచ్చే ఏడాదికి పూర్తి కానుందని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. కశింకోటలోని నూకాంబిక ఫంక్షన్ హాలు వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో రూ.4.53 కోట్లతో నియోజకవర్గంలోని మూడు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ ప్రభుత్వం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నిర్మాణానికి రూ.850 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ.. అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం-మాడుగుల మధ్య ప్రభుత్వ స్థలం సమకూరిన చోట కేంద్రియ విద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రూ.1.5 లక్షల కోట్లతో పాయకరావుపేట వద్ద స్టీల్ ప్లాంట్ నిర్మాణం కానుందన్నారు. దీని శంకుస్థాపనకు వచ్చే నెల 8న ప్రధాని మోదీ రానున్నారన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, పీలా గోవింద, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటం
- సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

నర్సీపట్నం: ఎన్నికల హామీలను కూటమి సర్కారు నెరవేర్చాలని, జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. నర్సీపట్నంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తికి నిధులు కేటాయించాలన్నారు. వ్యవసాయ రంగం కరువు కాటకాల నుంచి బయటపడాలంటే సాగునీటి వనరులు పెంపొందించడమే పరిష్కారమన్నారు. నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్లోకి చేర్చాలన్నారు. నర్సీపట్నం కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని, కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. తనిఖీలు నిర్వహించి లోపాలను సరిదిద్ది, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లింపు తప్పనిసరి చేయాలన్నారు. తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించాలన్నారు. తీర ప్రాంతాల్లో కాలుష్య కారక పరిశ్రమల ఏర్పాటును నియంత్రించాలన్నారు. వినియోగదారులపై విద్యుత్ సర్దుబాటు చార్జీలను ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం కూటమి ప్రభుత్వమే భరించాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయింపునకు ఎమ్మెల్యేలు, ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. మహాసభల్లో ఈ సమస్యలపై చర్చించి వీటి పరిష్కారానికి దశల వారీగా ఉద్యమాలు చేసేందుకు తీర్మానించామని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాడుతామని చెప్పారు.

చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న ఆటో పట్టివేత



పట్టుకున్న ఆటోతో వీఆర్‌వో జగదీష్, ఆటోలో ఉన్న చికెన్ వ్యర్థాలు

దేవరాపల్లి: చేపలకు మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న ఆటోను మారేపల్లి వీఆర్‌వో కె.జగదీష్ సోమవారం పట్టుకున్నారు. చికెన్ వ్యర్థాలను ఆటోలో అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు మారేపల్లిలో ఆటోను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఆటోను పరిశీలించిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న అందులో చికెన్, మటన్ వ్యర్థాలతో పాటు ఇతర కుళ్లిన వ్యర్థాలు గుర్తించారు. పట్టుబడిన వాహనాలపై కేసులు నమోదు చేయకుండా, చిన్నపాటి జరిమానాలతో విడిచి పెట్టడం వల్లే మళ్లీ మళ్లీ ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి చేపల పెంపకదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

27న రాష్ట్ర స్థాయి సీనియర్ వాలీబాల్ జట్ల ఎంపిక

అనకాపల్లి : జాతీయ స్థాయి సీనియర్ వాలీబాల్ పోటీలు వచ్చే ఏడాది జనవరి 7 నుంచి 13 వరకూ రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరుగుతాయని, ఈ పోటీలకు రాష్ట్రస్థాయి సీనియర్ మహిళ, పురుషుల జట్టు ఎంపిక ఈనెల 27న విజయవాడ ఎన్టీఆర్ జిల్లాలో ఇందిరాగాంధీ మున్సిపాల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారి రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే సీనియర్ మహిళా, పురుషుల వాలీబాల్ క్రీడాకారులు ఈనెల 27 ఉదయం 7 గంటలకు క్రీడామైదానంలో ఉండాలని, ఆధార్‌కార్డు, నేటివిటీ సర్టిఫికెట్, 10 పాస్ పాటోలు తీసుకుని వెళ్లాలని పేర్కొన్నారు.

పెద్దేరుకు వరద పోటు

- 300 క్యూసెక్కుల వరద నీరు విడుదల

మాడుగుల: గత మూడు రోజులుగా పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న వర్షాలకు సోమవారం వరదపోటు మొదలైంది. దీంతో జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు. వారం కిందట జలాశయంలోకి 50 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ప్రస్తుతం 200 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో సోమవారం సాయంకాలం జలాశయం ప్రధాన గేటు ద్వారా 300 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 136.45కు పెరిగింది. పెద్దేరు ఏటి బాధితులు రాత్రి పూట పెద్దేరులోకి దిగరాదని, జలాశయంలో నీటి నిల్వలు అధికంగా ఉండడంతో ఏ సమయంలోనైనా జలాశయం నుంచి వరద నీరు విడుదల చేయవచ్చునని, రైతులు అప్రమత్తంగా ఉండాలని జలాశయం అధికారులు చెబుతున్నారు.

గొలుగొండ తహసీల్దార్‌పై సర్పంచ్ ఫిర్యాదు


ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న సర్పంచ్ విజయలక్ష్మి

నర్సీపట్నం: నియంతలా వ్యవహరిస్తున్న గొలుగొండ తహసీల్దార్ శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పప్పుశెట్టిపాలెం సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి ఆర్డీవో వి.వి.రమణకు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామ ప్రథమ పౌరురాలైన తనకు సమాచారం ఇవ్వకుండా తన పంచాయతీ పరిధిలో జమ్మాదేవిపేట, పప్పుశెట్టిపాలెంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారన్నారు. టీడీపీ నాయకుల అండదండలతో తహసీల్దార్ శ్రీనివాసరావు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఆర్డీవో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని, అక్కడ కూడా న్యాయం జరగకపోతే తహసీల్దార్‌పై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానన్నారు.

సందేశాత్మకంగా నాటిక ప్రదర్శనలు


వేదాంతం నాటికలో ఓ ఘట్టం

అనకాపల్లి : స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో మూడో రోజైన సోమవారం ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలను ఎంపీ సీఎం రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఏడాది క్లబ్‌లో నాటికలు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. సోమవారం ప్రదర్శించిన నాటికల విశేషాలు ఇలా ఉన్నాయి.

వేదాంతం నాటిక మూలకథ...

అనకాపల్లి షిర్డిసాయి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'వేదాంతం' నాటిక ప్రదర్శించారు. మూల కథ కీ.శే.గుడిపాటి వెంకటాచలం, నాటకకరణ మార్గశీర్ష, దర్శకత్వం పి.ముత్యాలరావు. తాను ప్రేమించిన అమ్మాయి తనకు దూరమైన ఆమె రూపాన్ని గుండెల్లో దాచుకుని ఆరాధిస్తూ ఉన్న ఓ ప్రేమికునికి అనుకోని పరిస్థితుల్లో వివాహమైన ఓ అనాఘ్రాత పుష్పంగా తనకు ఎదురుపడితే ఆమె జీవితంలో తిరిగి అరుణోదయం తీసుకు రావడానికి ఆ వ్యక్తి పడిన తపనే ఇతివృత్తంగా నాటిక ప్రదర్శన రక్తికట్టింది.

బాంధవ్యాలను చాటిచెప్పే 'దేవరాగం'

రక్త సంబంధాలు..పేగు బంధాలు..అనుబంధాలు అనే మానవ సంబంధాలు.. తల్లిదండ్రులకి వారి సంతానానికి పరస్పరాధీనం. ఈ బంధం విచ్ఛిన్నమైతే తల్లిదండ్రులకి వృద్ధాప్యం శాపం అవుతుందని, విడవకుండా కంటికి రెప్పలా కనిపెట్టుకుని ఉంటే ఆ వృద్ధాప్యమే ఆ తల్లిదండ్రులకు మధురంగా మారుతుందనేది ఇతివృత్తంగా ప్రదర్శించిన 'దేవరాగం' ఆలోచింపజేసింది. కార్యక్రమంలో నాటకోత్సవ కన్వీనర్ కె.ఎం.నాయుడు, క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె.జోగినాయుడు, ప్రధాన కార్యదర్శి బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారి విల్లూరి చంద్రశేఖర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

యేసు క్రీస్తు ఆశీస్సులు జిల్లాపై మెండుగా ఉండాలి

- ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పిన జేసీ జాహ్నవి


క్రిస్మస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ జాహ్నవి, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

తుమ్మపాల: ప్రభుత్వం తరఫున, అందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ, యేసు క్రీస్తు ఆశీస్సులు జిల్లాపై మెండుగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి ఆకాంక్షించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన " హై టీ హోలీ క్రిస్మస్ - 2024' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమెతో పాటు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి విచ్చేశారు. క్యాండిల్ వెలిగించి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. క్రిస్మస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా చర్చిల వద్ద భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఒకరితో ఒకరు శాంతి, సమాధానం, ప్రేమతో జీవించాలని అన్నారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ పాస్టర్లకు గౌరవ వేతనం కింద నెలకు ఐదు వేల రూపాయలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. పాస్టర్ జాన్ పౌల్ మాట్లాడుతూ జననాన్ని గుర్చిన వార్త క్రిస్మస్ సందేశమన్నారు. పాస్టర్ తిమోతి క్రాంతి పాల్ ప్రారంభ ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీఆర్వో వై.సత్యనారాయణరాజు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రామారావు, ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మైనారిటీ సంక్షేమ శాఖ (ఇన్‌చార్జి) సత్యపద్మ, డీపీవో శిరీషారాణి, డీఈవో అప్పారావునాయుడు, జిల్లా ఖజానా అధికారి సుభాషిణి, విద్యుత్ ఎస్ఈ ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం


మాట్లాడుతున్న కోన లక్ష్మణ

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఊకదంపుడు హామీలతో గద్దెనెక్కిన సీఎం చంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన తర్వాత భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనట్లు ఏపీ భవన నిర్మాణకార్మిక సంఘం(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ విమర్శించారు. మండలంలో సంపత్పురం గ్రామం పరమటమ్మ ఆలయం వద్ద సోమవారం భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునఃపరిశీలించాలని, 2014 నుంచి పెండింగ్‌లో ఉన్న కార్మికుల క్లయిమ్‌లను త్వరితగతిన ఇవ్వాలన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్మికుల సంక్షేమ బోర్డుకు తన సొంత నిధులు అందజేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ సంఘం అధ్యక్షుడు సిహెచ్.రాజు, సహాయ కార్యదర్శి చిన్ని గణేష్, సభ్యులు చిన్ని, ఉప్పిలి ఆదినారాయణ, సత్తిబాబు, శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు


వేడుకలు చేసుకుంటున్న చిన్నారులు

అనకాపల్లి: స్థానిక ఉడ్‌పేటలో హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు చిన్నారులు చేపట్టారు. చిట్టిపొట్టి చిన్నారులంతా శాంటాక్లాస్, దేవదూత, జీసస్ తదితర వేషధారణతో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ శేశెట్టి గిరీష్‌కుమార్ మాట్లాడుతూ క్రీస్తు జననం, విశిష్టత, స్వయంగా ఆచరించి మానవాళికి నిర్దేశించిన మార్గం, తదితర అంశాలను కథల రూపంలో చిన్నారులకు వివరించారు. అనంతరం చిన్నారులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, చిన్నారులు విశ్రాంత ఏఈ మళ్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 1,806 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,760	5,260
మొదటి రకం	3,600	4.250
రెండో రకం	3,220	3,810
మూడోరకం	3,050	3,350

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
ముఫాసా	: సత్యనారాయణ స్క్రీన్-2
ముఫాసా	: పర్తిసాయి
బచ్చల మల్లి	: షిర్డీసాయి
జీబ్రా	: వెంకటేశ్వర
అమరన్	: శ్రీసత్య
పుష్ప-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 22 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 456 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 386 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

నత్తనడకన బాల ఆధార్


గవరపాలెం సచివాలయంలో ప్రత్యేక ఆధార్ సెంటర్

- సరిపడా ఆధార్ కేంద్రాలు లేక ఇబ్బందులు
- తరచూ మొరాయిస్తున్న సర్వర్
- నియోజకవర్గంలో 3,746 మంది చిన్నారులు
- ఇంతవరకు 1,060 మందికే నమోదు
- చిన్నారుల తల్లిదండ్రుల ఆందోళన

అనకాపల్లి: బాల ఆధార్ నమోదుకు చిన్నారులు, వారి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. బాలల తల్లిదండ్రులు పనులు మానుకుని దూర ప్రాంతాల్లో ఉన్న ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సచివాలయాల్లోను, బ్యాంకుల్లోను, బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో కేంద్రాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిరీక్షిస్తున్నా, అక్కడ ఆన్‌లైన్ సర్వర్ తరచూ మొరాయిస్తుండటంతో తిప్పలు పడుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6 సంవత్సరాలలోపు పిల్లలకు ప్రత్యేకంగా బాల ఆధార్ నమోదుకు శ్రీకారం చుట్టాయి. వీరికి పౌష్టికాహారం అందాలంటే ఆధార్ తప్పనిసరి చేశాయి. దీనిలో భాగంగా ప్రత్యేక ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేశాయి. ఈనెల 27వ తేదీ లోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ, మండల పరిధిలో కొన్ని సచివాలయాల్లో మాత్రమే ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో, బ్యాంక్‌లు వద్ద నిరీక్షణ చేస్తున్నారు. అవి కూడా దూర ప్రాంతాల్లో ఉండటంతో వ్యయప్రయాసలు పడుతున్నారు.

జనన ధ్రువీకరణకు పాట్లు...

అనకాపల్లి నియోజకవర్గంలో 234 అంగన్‌వాడీ కేంద్రాల్లో 3,746 మంది 0-6 సంవత్సరాలలోపు చిన్నారులు ఉన్నారు. వీరిలో ఇంతవరకూ 1,060 మందికి బాల ఆధార్‌లు అప్‌గ్రేడ్ చేశారు. అధిక శాతం తల్లిదండ్రుల వద్ద పిల్లల పుట్టిన తేదీ సర్టిఫికెట్లు లేకపోవడం, ఉన్నతాధికారులు పంపిన జాబితాలో పేర్లు, చిరునామాల్లో తప్పులు ఉండటంతో ఆధార్ నమోదు మరింత జాప్యం జరుగుతోంది.


ఉడ్‌పేట సచివాలయంలో ప్రత్యేక ఆధార్ సెంటర్

సమీపిస్తున్న యాప్‌లో నమోదు గడువు...

అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6 చిన్నారులు, గర్భిణులు, బాలింతలు బాల సంజీవ్ యాప్‌లో ముందుగా నమోదు చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరఫరా చేస్తున్న రేషన్ అందుతుంది. లేనిపక్షంలో రేషన్ ఈ నెల 27వ తేదీ తర్వాత నిలుపుదల చేయనుండటంతో ఆధార్ కేంద్రాలకు చిన్నారులు, వారి తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు.

నియోజకవర్గంలో 16 ఆధార్ కేంద్రాలే..

నియోజకవర్గంలో 79 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. అనకాపల్లి మండలంలో 26 సచివాలయాలకుగాను మూడు కేంద్రాల్లోను, పట్టణ పరిధిలో 27 సచివాలయాలకుగాను ఐదు కేంద్రాలతోపాటు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, మెయిన్‌రోడ్డు యూనియన్ బ్యాంక్, పెరుగుబజార్ జంక్షన్ వద్ద కార్పొరేషన్ బ్యాంక్‌ల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేశారు. కశింకోట మండలంలో 26 గ్రామ సచివాలయాలకు నాలుగు కేంద్రాలే ఉన్నాయి. కశింకోట పోస్టాఫీస్‌లో ఆధార్ కేంద్రం ఉంది. ఆయా కేంద్రాల్లో ఆన్‌లైన్ సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో ప్రత్యేక బాల ఆధార్ నమోదు నత్తనడకన సాగుతోంది. ప్రభుత్వం నియోజకవర్గంలో అన్ని సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లయితే బాల ఆధార్ ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుంది. ఎక్కడ చిన్నారులు అక్కడే ఆధార్‌లో తప్పులు సరిదిద్దుకోవడానికి వీలుగా ఉంటుంది. మండలాల నుంచి ఆధార్ నమోదు కోసం గ్రామీణ చిన్నారులను పట్టణానికి తీసుకురావడంతో రోజంతా వారితో తల్లిదండ్రులకు నిరీక్షణ తప్పడం లేదు.

పేరులో తప్పుల సవరణకు తిప్పలు



ఆధార్ కార్డులో నా ఆరేళ్ల బాబు పేరులో రెండు అక్షరాలు తప్పు పడ్డాయి. దానిని సరి చేయడానికి వారం రోజులు పైనే పట్టింది. ముందుగా జీవీఎంసీ కార్యాలయానికి వెళ్లగా, నోటరీ చేయించుకుని రావాలన్నారు. ఆన్‌లైన్లో నమోదు చేసుకున్న తర్వాత జోన్ కార్యాలయంలో సరి చేసుకుని బర్త్ సర్టిఫికేట్ తీసుకెళ్లడానికి వారం రోజులు పట్టింది. ఉడ్‌పేట బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్దకు వెళ్లి ఆధార్ కార్డులో పేరు సరి చేసుకోవడానికి రెండు రోజులు పట్టింది. ఈ కార్డు తీసుకుని అంగన్‌వాడీ కేంద్రంలో ఇవ్వగా నమోదు చేసుకున్నారు.

– పి.కల్యాణ్, మిరియాల కాలనీ, అనకాపల్లి

27న యాప్‌లో నమోదు చేసుకోవాలి



0-6 చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు ప్రభుత్వ పౌష్టికాహారం సక్రమంగా అందాలంటే ఆధార్ కార్డులో తప్పులు లేకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాలి. ఈ నెల 27వ తేదీ లోగా బాల సంజీవన్ యాప్‌లో నమోదు చేసుకోవాలి. తప్పులు లేకుండా నమోదు చేయడం వల్ల సకాలంలో రేషన్ సరుకులు లబ్ధిదారులకు అందుతాయి.

– పి.ప్రభావతి, సీడీపీవో, అనకాపల్లి

జోనల్ పరిధిలో 26న ఆశీల పాట

అనకాపల్లి: జోనల్ పరిధిలో వచ్చే ఏడాది జనవరి 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకూ ఆశీలు వసూలు చేసుకునేందుకు ఈ నెల 26న ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ బి.వి.రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ముందుగా జోనల్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకునేందుకు రూ.300 ప్రభుత్వానికి చలానా కట్టాలన్నారు. మరిన్ని వివరాలకు జోనల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిని లేదా ఎ1 గుమస్తాను సంప్రదించాలన్నారు.

ఫార్మా సిటీలో ప్రమాదాలకు ప్రభుత్వానిదే బాధ్యత

అనకాపల్లి: జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ప్రమాదాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రక్షిత డ్రగ్స్ ఫార్మా కంపెనీలో పీపీ బ్లాక్స్ సెంటరింగ్ పాయింట్ వద్ద హైడ్రోజన్ సల్ఫేడ్ వాయువు లీక్ ప్రమాదానికి గురైన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్ల ఫార్మా కంపెనీల్లో తరుచూ ప్రమాదాలు జరిగి కార్మికులు క్షతగాత్రులుగా మిగిలిపోగా, కొంతమంది మృత్యువాత పడుతున్నారని వాపోయారు. ఇప్పటికే జిల్లాలో నాలుగు ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరిగాయని, వీటిని చూసైనా కనువిప్పు కలగాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు, కార్మికుల ప్రాణాలు పోయినప్పుడు విచారణ పేరుతో ప్రభుత్వం హంగామా తప్ప సరైన పరిష్కామార్గం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తులు

తుమ్మపాల: రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కో ఆర్డినేటర్ చక్రవర్తి తెలిపారు. బ్యాచ్‌కు కేవలం 30 సీట్లు ఉన్నాయని, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులైన వారు కళాశాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సమాచారం కోసం 7013342667, 8143229228కు సంప్రదించాలన్నారు. నాన్ రెసిడెన్సియల్ పద్ధతిలో ఉండే శిక్షణ అనంతరం ఎన్ఎస్‌డీసీ, ఏపీఎస్ఎస్‌డీసీ సర్టిఫికెట్ మంజూరు చేస్తారన్నారు.

శారదానదిపై వంతెన నిర్మాణం పూర్తి చేస్తాం

స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే రామకృష్ణ

సాక్షి ఎఫెక్ట్..

కశింకోట: సాక్షి కథనానికి శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్పందించారు. స్థానిక గవరపేటలో శారదానదిపై వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇక్కడ వంతెన నిర్మాణం కాకపోవడం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులపై 'వంతెన లేక ఇక్కట్లు' శీర్షికన సోమవారం సాక్షిలో కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కశింకోటలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ కశింకోటలో మంచినీటి సమస్య నివారణకు గత టీడీపీ హయాంలో సంపతిపురం వద్ద భారీ నీటి పథకానికి రూ.65 కోట్లు ఇచ్చామన్నారు. ఆ సమయంలో గవరపేట శారదానదిపై తాను మంజూరు చేసిన వంతెన నిర్మాణం కాకపోవడం వెలితిగా ఉందని, దీన్ని పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సభలో ఎమ్మెల్యేకు సూచించారు. ఇందుకు రామకృష్ణ వెంటనే స్పందించి వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇకనైనా వంతెన నిర్మాణం కానుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

సాంకేతిక సహాయంతో సమస్యల పరిష్కారం

డీసీఎస్‌వో వి.ఎల్.నరసింహమూర్తి


మాట్లాడుతున్న నరసింహమూర్తి


సమావేశానికి హాజరైన వినియోగదారులు

అనకాపల్లి: సాంకేతిక సహాయంతో వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరించుకోవచ్చని జిల్లా పౌరసరఫరాల అధికారి(డీసీఎస్‌వో) కనకమేడల వి.ఎల్.నరసింహమూర్తి అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్, మండల కన్స్యూమర్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం అంశంపై సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారుల-2019 చట్టం పరిధిలోకి ఆన్‌లైన్ వినియోగదారులు కూడా వస్తారని స్పష్టం చేశారు. ఈ కామర్స్, ఈ చెల్లింపులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రక్షణ చట్టం ప్రకారం మధ్యవర్తిత్వం ద్వారా వినియోగదారుల సమస్యలను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ బీఐఎస్ కేర్ యాప్ ద్వారా బంగారు ఆభరణాల స్వచ్ఛతను తెలుసుకోవచ్చన్నారు. హెచ్‌యూఐడీ నంబరు ఉన్న బంగారు ఆభరణాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయం అధ్యక్షుడు దొడ్డి నూకఅప్పారావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు కె.కృష్ణారావు, ఎం.నరసింహులు, హాస్టల్ వార్డెన్స్ అధికారి ఎస్.సత్యనారాయణ, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్‌కు ఘన నివాళి


కశింకోట బాలికల హైస్కూలులో గణిత భావనలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా సైన్స్ అధికారి కాళిదాసు

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలులో సోమవారం జాతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తయారు చేసిన గణిత భావనలను ప్రదర్శించారు. వాటిలో ఉత్తమమైన వాటికి బహుమతులు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి డి. కాళిదాసు, గణిత ఉపాధ్యాయులు కేశవరావు, తాయారు, ఎం. పద్మ, నాగలక్ష్మి, రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

సబ్బవరం: మండలంలోని జీవీఎంసీ పరిధిలోని గంగవరం శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాల మేరకు.. గంగవరం శివారులో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు అందిన సమచారం మేరకు ఎస్ఐ గణేష్ పడాల్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అదే గ్రామానికి చెందిన మాటూరి వేణుగోపాల్(18), శ్రీను(36), నూకరాజు(35), శ్రీను(31)లను పట్టుకుని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.6,100 నగదు స్వాధీనం చేసుకుని సోమవారం కోర్టులో హాజరు పరచినట్లు సీఐ తెలిపారు. కోడి పందాలు, గుల్లాటలు, పేకాట ఆడినా, బెల్ట్ షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

బొజ్జన్నకొండపై విద్యార్థుల సందడి


బొజ్జన్నకొండ వద్ద విద్యార్థులు

అనకాపల్లి: మండలంలో శంకరం పంచాయతీ బొజ్జన్నకొండ వద్ద సోమవారం విద్యార్థులు సందడి చేశారు. పట్టణంలో గవరపాలెంలో మహాత్మ జ్యోతిబా పూలే ప్రభుత్వ పాఠశాల వనసమారాధన కార్యక్రమం ఇక్కడ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ 320 మంది విద్యార్థులు వివిధ రకాలైన ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వారికి బొజ్జన్న కొండ విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. మధ్యాహ్నం వనసమారాధన చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరులు, స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ కర్రి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ పనుల వేగవంతానికి వినతి


ఈవోకు వినతిపత్రం అందిస్తున్న ముగ్గు కిరణ్

సింహాచలం: సింహగిరిపై ప్రసాద్ స్కీమ్ నిధులతో నిర్మిస్తున్న నూతన షాపింగ్ కాంప్లెక్స్ పనులను వేగవంతం చేసి, వ్యాపారులకు అప్పగించాలని దేవస్థానం ఈవో వి.త్రినాథరావును సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్ కోరారు. ఈ మేరకు ఈవోను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. గత ఏడాది డిసెంబర్ ఆఖరి వారంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, నేటికీ పనులు పూర్తికాలేదని తెలిపారు. కాంప్లెక్స్‌కు దక్షిణ, ఉత్తరం ఇరువైపులా భక్తులు మార్కెట్లోకి వచ్చేలా మెట్లు నిర్మించాలన్నారు.

విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషనల్ సొసైటీ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్


తాళ్లపాలెం గురుకులంలో భోజన శాలను పరిశీలిస్తున్న సొసైటీ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్


స్టోర్ రూం పరిశీలిస్తున్న దృశ్యం

కశింకోట: విద్యలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషనల్ సొసైటీ కార్యదర్శి వి. ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడానికి చర్యలు చేపట్టాలన్నారు. టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలన్నారు. బాగా చదివే విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని రుచికరంగా అందించాలన్నారు. దీనిపై పర్యవేక్షణ ఉండాలన్నారు. డార్మెటరీ, పరిసరాలను, మరుగుదొడ్లు, స్నానాల గదులను శుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు సదుపాయాలను సకాలంలో అందించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యా ప్రమాణాల మెరుగుకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు, సలహాలిచ్చారు. ముందుగా భోజన శాలలో అందిస్తున్న భోజనాలను, స్టోర్‌లో వస్తువుల నిల్వలను పరిశీలించారు. డార్మెంటరీ, పరిసరాలను, టీచర్స్ లెర్నింగ్ మెటీరియల్, అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయకర్త ఎస్. రూపావతి, ప్రిన్సిపాల్ జి. గ్రేస్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి


హాజరైన హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు

కశింకోట: కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన కలిగించాలని ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో హెచ్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సోమవారం కిశోరి బాలికల వికాసంపై మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదుగురు సభ్యులతో కూడిన బృందాలు తమ పరిధిలోని 11 నుంచి 18 ఏళ్లలోపు బాలికలను 15 మందితో గ్రూపుగా చేసి బాల్య వివాహాలు నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్, బ్యాడ్ టచ్, ఆరోగ్య పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల గురించి అవగాహన కలిగించాలన్నారు. మధ్యలో స్కూలు, కళాశాల మానేసిన కిశోరి బాలికలకు కూడా వారి వికాసంపై సంబంధిత అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కలిగించాలన్నారు. సంరక్షణ అధికారి కె.ఎల్. మనోహరరావు, అడ్వకేట్ కుసుమ, ఈవోపీఆర్డీ ఎం. వెంకటలక్ష్మి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గెడ్డ ఆక్రమణకు టీడీపీ కార్పొరేటర్ యత్నం

- అడ్డుకున్న పెందుర్తి రెవెన్యూ అధికారులు, సిబ్బంది


టీడీపీ కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు కుటుంబ సభ్యుల ఆక్రమణలో ఉన్న గెడ్డ పోరంబోకు స్థలం

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో అధికార తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధుల కబ్జా పర్వం కొనసాగుతోంది. జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి నడిబొడ్డున వార్డు సచివాలయానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ గెడ్డ పోరంబోకు స్థలాన్ని స్థానిక కార్పొరేటర్, టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు చెరబట్టారు. ఆ స్థలంలో సోమవారం నిర్మాణం చేసేందుకు సన్నాహాలు చేస్తున్న తరుణంలో సమాచారం అందుకున్న పెందుర్తి రెవెన్యూ సిబ్బంది ఆక్రమణను అడ్డుకున్నారు. సిమెంట్ పిల్లర్ల నిర్మాణం కోసం తవ్విన గోతుల్ని జేసీబీ సాయంతో పూడ్చేశారు. ఆక్రమణను అడ్డుకుంటున్న క్రమంలో స్థానిక సచివాలయ వీఆర్వో రూపను ఆక్రమణదారులు దుర్భాషలాడటంతో ఆమె కన్నీటి పర్యంతం అయింది.

గెడ్డకే ఎసరు పెట్టేలా..

పెందుర్తి సర్వే నెంబర్ 190/9లో దాదాపు 18 సెంట్ల ప్రభుత్వ పోరంబోకు(గెడ్డ) భూమి ఉంది. పెందుర్తి పట్టణంలో ప్రధాన మురుగు కాలువల్లో ఇది ఒకటి. అయితే ఈ గెడ్డ(కాలువ) స్థలంలో దాదాపు 15 అడుగుల మేర ఆక్రమించిన సదరు కార్పొరేటర్ కుటుంబ సభ్యులు శాశ్వత నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నించారు. ఒక ప్రజాప్రతినిధిగా కబ్జాలను అడ్డుకోవాల్సింది పోయి, విధి నిర్వహణలో ఉన్న అధికారులపైనే చిందులు తొక్కడం గమనార్హం. ఇక్కడ జరుగుతున్న గెడ్డ ఆక్రమణను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని ఆర్ఐ హరి ప్రసూన తెలిపారు.